

కూకట్‌పల్లి ప్రగతి నివేదన సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్ పక్కన ఎమ్మెల్యే కృష్ణారావు

# రూ.933.28 కోట్లతో కూకట్‌పల్లి అభివృద్ధి

- **ఇచ్చిన, ఇవ్వని హామీలన్నింటినీ నెరవేర్చాను**
- **మరోసారి ఆశీర్వదిస్తే..మరింత అభివృద్ధి**
- **ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 5 : కూకట్‌పల్లి నియోజకవర్గంలో తొమ్మిదిన్నరేండ్ల కాలంలో రూ.933.28 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. గురువారం కేపీహెచ్‌బీ కాలనీలో కూకట్‌పల్లి నియోజకవర్గం అభివృద్ధిపై నిర్వహించిన ప్రగతి నివేదన సభలో రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖామంత్రి కల్వకుంట్ల తారకరామారావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్‌కుమార్, మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. కాలనీలు, బస్తీలలో మౌలిక వసతులు కల్పించామని ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం బాలానగర్, కైత్లాపూర్, కేపీహెచ్‌బీ కాలనీలో ఫ్లైఓవర్లు, కాలనీ 7వ ఫేజ్‌లో అండర్ పాస్‌లు నిర్మించామని, నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాలను పార్కులుగా, క్రీడా ప్రాంగణాలుగా అభివృద్ధి చేశామన్నారు. కేపీహెచ్‌బీ కాలనీలో కోట్లాది రూపాయల విలువైన హౌసింగ్‌బోర్డు స్థలాలను ప్రజలకు అంకితం చేశామన్నారు.

కాలనీ 9వ ఫేజ్‌లో మూడు ఎకరాల స్థలం, కాలనీ 1, 2వ ఫేజ్‌లలో మూడు ఎకరాల స్థలం, కాలనీ 3వ ఫేజ్‌లో మూడు ఎకరాల స్థలాన్ని హౌసింగ్‌బోర్డు నుంచి జీహెచ్‌ఎంసీకి మార్చి ఆహ్లాదకరమైన పార్కులుగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కాలనీ 3వ ఫేజ్‌లో హౌసింగ్‌బోర్డు స్థలంలో స్థానిక కార్పొరేటర్ సొంత ఖర్చుతో ఎన్‌టీఆర్ పేరుతో ప్రభుత్వ పాఠశాల భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. చెరువుల సుందరీకరణలో భాగంగా ఎస్‌టీపీల నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. మోడల్ రైతుబజార్, ఫిష్ మార్కెట్, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, ఎనిమల్ సెంటర్, బస్తీ దవాఖానలు ఎన్నో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో ప్రజా సమస్యలన్నీ పరిష్కరించినట్లు తెలిపారు.

**● డబుల్ బెడ్రూమ్ ఇండ్లు అదనంగా కేటాయించాలి..**

కూకట్‌పల్లిలో నివసించే పేద ప్రజల కోసం డబుల్ బెడ్రూమ్ ఇండ్లను అదనంగా కేటాయించాలని మంత్రి కేటీఆర్‌ను కోరారు. పేద ప్రజల కోసం నగరంలో మరో లక్ష డబుల్ బెడ్రూమ్ ఇండ్లను నిర్మించేందుకు మంత్రి కేటీఆర్ హామీనివ్వడం సంతోషకరమన్నారు. కూకట్‌పల్లిలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని 44వేల మందికి ఆసరా పింఛన్లు, 16వేల మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో ఆర్థిక సాయం అందుతుందన్నారు.

**● రంగధాముని ఫ్రంట్‌లేక్ పార్కు ప్రారంభం..**

కూకట్‌పల్లి నియోజకవర్గంలో రంగధాముని చెరువుగట్టుపై రూ.9.80 కోట్లతో అభివృద్ధి చేసిన రంగధాముని ఫ్రంట్‌లేక్ పార్కును ప్రారంభించారు. రంగధాముని చెరువు సుందరీకరణలో భాగంగా రూ.19.30 కోట్లతో మురుగునీటి మళ్లింపు కోసం పైప్‌లైన్ (సీవరెజ్ పైప్‌లైన్), అభివృద్ధి పనులను మంత్రి తారకరామారావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్‌కుమార్ లు ప్రారంభించారు. అనంతరం కేపీహెచ్‌బీ కాలనీలోని కల్వారి టెంపుల్ రోడ్డులో శ్రీలాపార్కు ప్రైడ్ నుంచి ముళ్లకత్వ చెరువు ఎస్‌టీపీ వరకు రూ.11.63 కోట్లతో చేపట్టనున్న సీవరెజ్ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు.

### కూకట్‌పల్లికి వరాల జల్లు..

- కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్‌లో మూడు ఎకరాల స్థలంలో పార్కు అభివృద్ధి కోసం రూ.12.5 కోట్లను వెంటనే కేటాయిస్తున్నట్లు మంత్రి కేటీఆర్ ప్రకటించారు.
- కూకట్‌పల్లి రంగధాముని చెరువు అభివృద్ధి కోసం అదనపు నిధులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

### మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం..

రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖమంత్రి కేటీఆర్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



రంగధాముని చెరువుపై అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, జడ్పీ మమత తదితరులు



సెల్ఫీలు దిగుతున్న సందర్శకులు



ఆకర్షణీయంగా రంగధాముని చెరువు



బహిరంగ సభకు తరలివచ్చిన జనం



విద్యుత్ వెలుగుల్లో రంగధాముని చెరువు



బహిరంగ సభ ప్రాంగణం వద్ద బంజారాల నృత్యం

## నేటినుంచి విద్యార్థులకు అల్పాహారం

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 5 : రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం రూపొందించిన ముఖ్యమంత్రి అల్పాహారం (సీఎం బ్రేక్‌ఫాస్ట్) కార్యక్రమం నేడు కూకట్‌పల్లి ఉన్నత పాఠశాలలో లాంఛనంగా ప్రారంభమవుతుందని కూకట్‌పల్లి ఎంఈవో ఆంజనేయులు తెలిపారు. కూకట్‌పల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్‌ఎస్)లో 1200 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొదటిరోజు విద్యార్థులతో పాటు తల్లిదండ్రులందరికీ అల్పాహారాన్ని అందించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈనెల 26 నుంచి కూకట్‌పల్లి, బాలానగర్ మండలాల పరిధిలోని అన్ని ప్రభుత్వం పాఠశాలల్లో సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

## క్రీడాకారులకు ప్రోత్సాహం



క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను అందిస్తున్న కార్పొరేటర్లు శిరీషాబాబూరావు, సబీహాబేగం, డీసీ రమేశ్ తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 5 : క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేస్తూ క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు బాలాజీనగర్ కార్పొరేటర్ శిరీషాబాబూరావు అన్నారు. గురువారం కేపీహెచ్‌బీ కాలనీ భువనవిజయం గ్రౌండ్‌లో కార్పొరేటర్లు శిరీషాబాబూరావు, సబీహాబేగం, డీసీ రమేశ్ లు క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో కాలనీలు, బస్తీలలో నిరుపయోగంగా ఖాళీ స్థలాలను క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం స్పోర్ట్స్ కిట్లను అందిస్తున్నదన్నారు. కార్యక్రమంలో తిరుపతిరావు, నాగేశ్వర్‌రావు, ధనలక్ష్మి తదితరులున్నారు.

## సీసీ కెమెరాలతో నిరంతర నిఘా



సీసీ కెమెరాల ప్రారంభ కార్యక్రమంలో పోలీసు అధికారులతో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

బాలానగర్, అక్టోబర్ 5 : సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉంటుందని ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. గురువారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని సాయి నారాయణపురికాలనీలో 70 శాతం సొంత నిధులు కేటాయించి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బేగంపేట ఏసీపీ మధుసూవదన్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, బోయిన్‌పల్లి సీఐ బీఎల్‌ఎన్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ నాగయ్యలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కర్రె జంగయ్య, ఇర్ఫాన్, హరినాథ్, మల్లేశ్‌యాదవ్, బుర్రి యాదగిరి, మట్టి శ్రీనివాస్, కుమార్, కార్తీక్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## అన్ని కాలనీలలో సీసీ రోడ్లు



ఆల్విన్ కాలనీ డివిజన్ ధరణీనగర్, జయశంకర్ కాలనీలలో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో సీసీ రోడ్డు నిర్మాణాలను చేడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాలనీవాసులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

– మియాపూర్, అక్టోబర్5

## బాలబతుకమ్మ పోస్టర్ ఆవిష్కరణ



సాయి అలేఖ్య సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్మిస్తున్న బాల బతుకమ్మ పాట పోస్టర్‌ను తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షులు గొట్టిముక్కల పాండురంగారావు గురువారం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని తన నివాసంలో ఆవిష్కరించారు.

– మియాపూర్/కేపీహెచ్‌బీ కాలనీ అక్టోబర్5